క్లుప్తంగా

హెబ్బటంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడు

హొళగుంద: మండలంలోని హెబ్బటం గ్రామంలో సవారమ్మ అవ్వ గుడి వద్ద ఫొటో గ్రాఫర్ పీరా ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యువనేత ఎస్‌కే గిరి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. రక్తదానం వల్ల గుండె నొప్పి, క్యాన్సర్, స్థూలకాయం వంటి అనారోగ్య సమస్యలు రావని తెలిపారు. శిబిరంలో 32 మంది రక్తదానం చేశారు. జనసేవా ఆర్గనైజేషన్ నాయకుడు విరుపాక్షి, రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాల పరిశీలన



హొళగుందలో సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న పీఆర్ డీఈ శ్రీరాములు

హొళగుంద: స్థానిక తహసీల్దార్ కార్యలయం వద్ద, మార్లమడికి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను సోమవారం పీఆర్ డీఈ శ్రీరాములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరుగుదొడ్లకు గుంత తీసి రింగులు వేయాలని, నీటి వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే డోర్, కిటికీలు, ఫర్నీచర్ ఏర్పాటు చేసే పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని పీఆర్ ఏఈ సోమప్పకు తెలియజేశారు. సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామ కొండపై ఉన్న ప్రభుత్వ స్థలంలో మాల, మాదిగలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఎంపీటీసీ రాజు, గ్రామస్తులు సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలని కోరారు.

టాపర్లకు ప్రోత్సాహక బహుమతులు

వెల్దుర్తి: స్థానిక బాలుర, బాలికల జెడ్పీహెచ్ఎస్‌లలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వెల్దుర్తి జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సహాయం అందించారు. బాలుర హైస్కూల్‌లో టాపర్లు మధు కిరణ్, శివ, తౌఫిక్, బాలికల హైస్కూల్ టాపర్లు పల్లవి, భార్గవి, త్రివేణి, కీర్తనలకు వరుసగా ఒక్కొక్కరికి 2 వేలు, వెయ్యి చొప్పున అందించారు. ఎంఈఓలు ఇందిర, రమేశ్, హెచ్‌ఎంలు చంద్రావతి, నాయక్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

చేపల పెంపకానికి ప్రోత్సాహం

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం చేపల పెంపకానికి 65 శాతం సబ్సిడీతో ప్రోత్సాహం అందిస్తుందని వైకేపీ ఏపీఎం మధుబాబు సోమవారం తెలిపారు. ఆసక్తి గల వారు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. చేపల పెంపకానికి దాదాపు రూ.10 లక్షల రుణ సహాయం అందుతుందన్నారు. యూనిట్ మంజూరైన వెంటనే ఫిషరీష్ శాఖ వారే చేపలు ఇవ్వడంతో పాటు పెంపకంలో శిక్షణ కూడా ఇస్తారన్నారు. ఇప్పటికే మండలంలో బురుజుల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మలేరియా కేసు నమోదు



మలేరియా బాధితుడి ఇంట్లో ద్రావణం స్ప్రే చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఈ వర్షాకాలం సీజన్‌లో తొలి మలేరియా కేసు పట్టణంలోని గాంధీనగర్‌లో నమోదు కావడంతో జిల్లా మలేరియా నివారణ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గాంధీనగర్‌లో ఓ వ్యక్తికి జ్వరం రావడంతో రక్త పరీక్ష చేయగా మలేరియాగా నిర్ధారణ అయ్యింది. దీంతో సోమవారం జిల్లా అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది వ్యాధిగ్రస్తుడి ఇంట్లో, మురికి కాలువల్లో దోమలు, లార్వా నివారణకు పైరిత్రమ్ స్ప్రే చేశారు. పరిసర ప్రాంతంలో ఫీవర్ సర్వే చేసి 60 మంది రక్త నమూనాలు సేకరించారు. పట్టణంలో దోమల నివారణకు రాత్రి వేళ ఫాగింగ్ చేయించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి సూచించారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్థానిక సబ్‌యూనిట్ అధికారి నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షతో ఉచిత సేవలు

- ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తిస్తున్న వలంటీర్లు
- ఉచితంగా 11 రకాల సేవలు
- మండలంలోని 17 సచివాలయాల్లో 760 సర్టిఫికెట్లు జారీ
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ఎం.కొట్టాలగ్రామంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం (ఫైల్)

ఆలూరు రూరల్: అర్హత కలిగి సాంకేతిక లోపం, ఇతర కారణాల వల్ల సంక్షేమ పథకాలకు దూరమైన వారికి తిరిగి వర్తింపజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ప్రభుత్వం ఇంటింటా జల్లెడపట్టి మరీ అర్హులను గుర్తించి పథకాలు అందిస్తోంది. వలంటీర్లు తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి వాళ్లకు ఏ విధమైన ఇబ్బందులు ఉన్నాయి. ఏ పథకాలు అందలేదు, ఏ ధ్రువీకరణ పత్రాలు కావాలని సర్వే నిర్వహించి వివరాలు నమోదు చేసుకుంటారు. తర్వాత మండలాధికారులు గ్రామ సచివాలయం పరిధిలో శిబిరాలు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తారు. ఈ కార్యక్రమంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 760 మందికి లబ్ధి

ఆలూరు మండలంలో 17 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. 241 క్లస్టర్లు ఉన్నాయి. వీటి పరిధిలో 16,929 కుటుంబాలు ఉన్నాయి. ఇప్పటివరకు 3 వేలకు పైగా కుటుంబాలను సర్వే చేసి అర్హులను గుర్తించి ఇప్పటివరకు 2,180 టోకెన్లు ఇచ్చారు. నాలుగు రోజుల్లో 8 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి అర్హులైన 760 మందికి అధికారులు వివిధ రకాల ధ్రువ పత్రాలు జారీ చేశారు. గ్రామ సభల్లో ఉచితంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా వారంలో ప్రతి మంగళ, బుధ, శుక్రవారాల్లో గ్రామ సభలు నిర్వహించి గుర్తించిన వారికి ధ్రువపత్రాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికను మండలస్థాయి అధికారులు సిద్ధం చేశారు. జూలై ఒకటో తేదీన ప్రారంభమైన జగనన్న సురక్ష గ్రామ సభలు మండలంలో ఇప్పటి వరకు నాలుగు రోజులు నిర్వహించారు. నేడు (మంగళవారం) నుంచి గ్రామ సభలకు అన్ని సచివాలయాల పరిధిలో వలంటీర్లు సర్వే చేసి ధ్రువపత్రాల కోసం దరఖాస్తులను స్వీకరించి సచివాలయాలల్లో అందించారు.

గత నాలుగు రోజుల్లో మండలంలో అందించిన సేవలు

మండలంలో సచివాలయాలు	17
మొత్తం కుటుంబాలు	16,929
సర్వే చేసిన కుంటుంబాలు	3,011
జారీ చేసిన టోకెన్లు	2,180
జారీ చేసిన ధ్రువీకరణ ప్రతాలు	760

వెంటనే కౌలు కార్డు ఇచ్చారు



నేను నా భర్త వెంకటరాముడు ఎకరం పొలం కౌలుకు చేసుకుంటున్నాం. జగనన్న సురక్ష కింద వలంటీర్ ఇంటి వద్దకు దరఖాస్తు ఫారంకు కావాల్సిన పత్రాలు తీసుకెళ్లాడు. ఏడు రోజుల్లోనే నాకు కౌలు కార్డు ఇచ్చారు. గతంలో ఆలూరుకు వెళ్లి దరఖాస్తు చేసుకునేదాన్ని దీంతో సమయం వృథా అయ్యేది. కార్డు రావడానికి చాలా రోజులు పట్టేది. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న వెంటనే కౌలు కార్డు ఇచ్చారు.

– లింగమ్మ, ఎం.కొట్టాల గ్రామం

ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు



వలంటీర్లను ఇంటింటికీ పంపించి సర్వే చేయిస్తున్నాం. ప్రతి కుటుంబానికి కావాల్సిన సర్టిఫికెట్లు ఉచితంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల సమయం వృథా కాకుండా ఇంటి వద్దనే పౌర సేవలను అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం తీసుకొచ్చింది. అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– అల్లబకాష్ ఎంపీడీఓ, ఆలూరు

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయం వద్ద రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఎమ్మిగనూరురూరల్: గోనెగండ్ల మండలం గంజెళ్ల గ్రామంలో బాలికపై అత్యాచార యత్నానికి సహకరించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ సోమవారం ప్రజా సంఘాల ఆధ్వరంలో శివ సర్కిల్ నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. డీఎస్పీ బయటకు వచ్చి సమాధానం చెప్పాలని రోడ్డుపై బైఠాయించారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనంద్‌బాబు, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేష్, వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గురుశేఖర్, తదితరులు మాట్లాడుతూ.. బాలికపై అత్యాచార యత్నం జరిగి 22 రోజులు అవుతున్నా, అందుకు సహకరించిన వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. నిందితులకు రూరల్ సీఐ, గోనెగండ్ల ఎస్ఐ సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న వారందరినీ అరెస్ట్ చేసి, నిందితులకు సహకరిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ సీతారామయ్య మాట్లాడుతూ.. ఈనెల 13వ తేదీ సాక్షులుగా ఉన్నవారు కార్యాలయానికి వస్తే విచారిస్తానని, వారు రాకపోతే తానే 14వ తేదీ గంజెళ్లకు వచ్చి విచారణ చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



కటారుకొండలో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని కటారుకొండ గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం జగనన్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రారంభించి ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలనుంచి అందిన సమస్యలు, విన్నపాలను వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారి నుంచి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి ఖలీల్‌బాష విన్నవించగా, రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, ఎంపీడీఓ విశ్వమోహన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, నాయకులు బ్రహ్మానందరెడ్డి, మురళీధర్ రెడ్డి, జయరామిరెడ్డి, లక్ష్మి మాధవరెడ్డి, రహమతుల్లా, రామచంద్రుడు, శివ, లక్ష్మన్న, శేషు, సురేశ్, మనోహర్, పులిచెర్ల చంద్రమోహన్, తాపలకొత్తూరు వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

నేడు తాపలకొత్తూర్, పులిచెర్ల గ్రామాలలో..

మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే అధ్వర్యంలో మండల పరిధిలోని తాపలకొత్తూరు, పులిచెర్ల గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి తెలిపారు. అలాగే కటారుకొండ కార్యక్రమంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో సైతం ఎమ్మెల్యే పాల్గొననున్నట్లు తెలిపారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

వెల్దుర్తి: మెట్లపై నుంచి జారిపడి మృతిచెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, పట్టణానికి చెందిన అనకల గిడ్డయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భరోసా ఇచ్చారు. ఆమె సోమవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డితో కలిసి గిడ్డయ్య ఇంటికి చేరుకుని భార్య, పిల్లలను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, అనకల కోదండ, బాలాజీ, ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు వెంట ఉన్నారు.

ప్రతి గడపకు సంక్షేమం



ఎమ్మిగనూరు 23వ వార్డులో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనం గుండెల్లో చోటు సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 23వ వార్డులో కౌన్సిలర్ చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్ అందజేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు పరిధిలో కొన్ని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు, కుళాయిల ఏర్పాటు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, నాయకులు బుట్టారంగయ్య, వీరేంద్ర, నజీర్‌అహమ్మద్, రియాజ్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దమరీవీడు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కార్మికులు ఉరుకుందు, నాగరాజు తదితరులు డిమాండ్ చేశారు. వారు సోమవారం పెద్దమరీవీడు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. 9 నెలలుగా వేతనాలు మంజూరు చేయకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం



బసవరాజు (ఫైల్)

ఆలూరు: హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామానికి చెందిన కోడుమూరు బసవరాజు (30) సోమవారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నిట్రవట్టి గ్రామానికి చెందిన లేట్ కోడుమూరు మల్లికార్జునగౌడు, బసమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు బసవరాజు సోమవారం ఉదయం పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లారు. విద్యుత్ మోటారు కనెక్షన్ లూజు కావడంతో స్టాటర్‌ను ఆన్ చేసేందుకు ప్రయత్నించగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమీపంలో ఉన్న రైతులు అతని తల్లి బసమ్మ, భార్య లతకు సమాచారం అందించడంతో వారు వచ్చి మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి రెండేళ్ల కుమారుడు తస్విక్ ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, మండల కన్వీనర్ వీరేష్ తదితరులు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



కురువ వీరనాగడు (ఫైల్)

నందవరం: మండల పరిధిలోని హాలహర్వి గ్రామానికి చెందిన కురువ వీరనాగడు (26) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం కన్నుమూశాడు. వివరాలు.. గ్రామానికి చెందిన కురువ వెండి ఈరన్న కుమారుడు వీరనాగడు రెండేళ్లుగా వెన్నుపూస నొప్పితో బాధపడుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో చికిత్స చేయించుకున్నాడు. ఈ నెల 4వ తేదీ సాయంత్రం నడుము, వెన్నుపూస నొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతదేహానికి డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వీరనాగడుకి భార్య పద్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పరమేష్ తెలిపారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం



చిప్పగిరిలో బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం మహిళలు

చిప్పగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న అందిస్తున్న సంక్షేమ పాలన దేశానికే ఆదర్శమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం చిప్పగిరిలో ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరాతీశారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు పొందని వారు ఉంటే వారికి కావాల్సిన సర్టిఫికెట్లు మంజూరు చేసి వెంటనే పథకాలు అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. చిప్పగిరిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ..దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. కులా, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా ప్రతిఒక్కరికీ పథకాలు అందిస్తున్నట్లు కొనియాడారు. ప్రజా సంక్షేమాన్ని ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై ముఖ్యమంత్రి జగనన్న పాలనపై తప్పుడు ప్రచారం చేస్తూ జనాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, అలాంటి వాటిని నమ్మరాదని సూచించారు. 2024 ఎన్నికల్లో జగనన్నకు మద్దతు ఇస్తారా అని సభకు హాజరైన మహిళలను అడగ్గా వారందరూ చేతులెత్తి 'జై జగన్.. మా నమ్మకం నువ్వే జగనన్న.. మళ్లీ నువ్వే రావాలి అని ముక్త కంఠంతో నినదించడంతో సభా ప్రాంగణం హోరెత్తింది. వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణ స్వామి, జూటూరు హేమలత, మారయ్య, నరసింహులు, మల్లికార్జున, రంగస్వామి, సర్వర్ ఖాన్, గోవిందరాజులు, తహసీల్దారు లక్ష్మినారాయణ, ఎంపీడీఓ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం



బహిరంగ సభకు పెద్ద ఎత్తున హాజరైన మహిళలు

వైఎస్సార్‌సీపీలో చేరిక

చిప్పగిరి: మండలంలోని నగరడోణ గ్రామానికి చెందిన 100 కుటుంబాల ప్రజలు బెల్డోణ గోవిందు ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి గుమ్మనూరు జయరాం పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రాజశేఖర్, సిద్ధు, రవి, రాజు, రమేష్, మధుసూదన్, రమేష్, అనిల్, తదితరులు ఉన్నారు.

ప్యాకేజీ మత్తులో మాట్లాడితే ఊరుకోం

పత్తికొండటౌన్: సేవాభావంతో పనిచేస్తున్న గ్రామ/వార్డు వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రాష్ట్ర వలంటీర్ల హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు హత్తిబెళగల్ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వలంటీర్ల సంఘం నాయకులు సోమవారం పత్తికొండ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ వెంకటేశ్వర్లును కలసి పవన్‌కళ్యాణ్‌పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. వారాహి యాత్రలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. గౌరవ వేతనంతో సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పవన్‌కళ్యాణ్ వాస్తవాలు గ్రహించి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వాలంటీర్ల సంఘం నాయకులు మల్లికార్జున, రెహెనా, పర్వీన్ బాను, గౌసియా, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

హొళగుంద: కరోనా సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి సేవలందించిన వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్‌పై కేసు నమోదు చేయాలని హొళగుంద అగ్రి బోర్డు చైర్మన్ మల్లికార్జున డిమాండ్ చేశారు. వలంటీర్లు అమ్మాయిల వివరాలు, వితంతువుల వివరాలు తెలుసుకుంటున్నారని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. పవన్‌కల్యాణ్ ఒక సంఘ విద్రోహ శక్తి అని మూడు పెళ్లిళ్లు చేసుకుని మోసగించారని ఎద్దేవా చేశారు. దత్త తండ్రి ఇచ్చిన ప్యాకేజీ మత్తులో పనికిమాలిన మాటలు మాట్లేడితే ఉరుకునేది లేదని హెచ్చరించారు.

పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

నందవరం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌పై కేసు నమోదు చేయాలని జేసీఎస్ మండల కన్వీనర్ చాంద్‌బాషా, మండల అధికార ప్రతినిధి వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లతో సంత మార్కెట్ నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ రాముడకు ఫిర్యాదు అందించారు. వారు మాట్లాడుతూ.. జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కనీసం ఎమ్మెల్యేగా గెలవలేని పవన్‌కళ్యాణ్ అక్కసుతోనే వలంటీర్లను విమర్శించడం సబబు కాదన్నారు. రాజకీయమంటే సినిమా కాదని, విలువలతో కూడిన రాజకీయం చేస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. సచివాలయ కన్వీనర్లు మీసాల సంపత్‌గౌడ్, చాంద్‌తాత, వలంటీర్లు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై నిరసన

దేవనకొండ: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గ్రామ/వార్డు వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కాకర్ల శాంతికుమార్, వలంటీర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఏలూరులో వారాహి బహిరంగ సభలో ఆదివారం పవన్‌కళ్యాణ్.. వలంటీర్లు హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారని నిరాధార ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. ఆ వ్యాఖ్యలు వెనక్కు తీసుకొని పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శేఖర్ (ఫైల్)

డి హీరేహాళ్(రాయదుర్గం): డి.హీరేహాళ్ మండలం హడగలి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన శేఖర్ (39) రాయదుర్గంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. బళ్లారిలో నివాసం ఉంటూ రోజూ రాయదుర్గానికి వచ్చి వెళ్లేవారు. సోమవారం బళ్లారి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన మార్గమధ్యంలో హడగలి వద్దకు చేరుకోగానే వేగ నియంత్రణ కోల్పోయి బైక్ అదుపుతప్పడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వీఆర్వోల సంఘం రాష్ట్ర కమిటీలో చోటు

తుగ్గలి: గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) సంఘం రాష్ట్ర కమిటీలో రాతన వీఆర్వో నాగేంద్రకు స్థానం లభించింది. ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో నాగేంద్ర రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఆంజనేయకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులకు తప్పని తిప్పలు



ఆలూరు సీహెచ్‌సీలో గైనకాలజిస్ట్ కోసం నిరీక్షిస్తున్న గర్భిణులు

ఆలూరు రూరల్: వైద్యాధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా గర్భిణులు చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రతి నెలా 9న గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నెల 9న ఆదివారం సెలవు కావడంతో సోమవారం గైనకాలజిస్ట్ వచ్చి పరీక్షలు చేయాల్సి ఉంది. అయితే ఈ నెల 11వ తేదీన స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తారని ఉన్నతాధికారులు ఆలూరు ప్రభుత్వ వైద్యశాల అధికారులకు మెయిల్ ద్వారా శనివారం సమాచారం ఇచ్చారు. దీనిపై ఇక్కడి సీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది ఏఎన్‌ఎంలకు సమాచారం ఇవ్వకపోవడంతో సోమవారం రోజే స్కానింగ్ పరీక్షలు చేస్తారనుకొని నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆశావర్కర్లు వంద మందికి పైగా గర్భిణులను ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్యురాలి కోసం వేచి ఉన్నారు. ఉదయం నుంచి ఏమీ తినకుండా గర్భిణులు ఎంతసేపు వేచిఉండాలని బంధువులు గట్టిగా అడగడంతో అప్పుడు తేరుకున్న సిబ్బంది ఈ రోజు మేడం రారని.. స్కానింగ్ పరీక్షల కోసం మంగళవారం రావాలని చెప్పడంతో వారు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరాశతో వెళ్లిపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలూరు సీహెచ్‌సీకి రెగ్యులర్ గైనకాలజిస్టును నియమించాలని మహిళలు కోరుతున్నారు.

సెలవుల్లో వైద్యులు..ఇబ్బందుల్లో రోగులు..

ఆలూరు సీహెచ్‌సీలో 6 మంది డాక్టర్లు పనిచేస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ లక్ష్మినారాయణ నెలన్నర క్రితం లీవ్‌లో వెళ్లిపోయారు. ప్రస్తుతం ఉన్న డాక్టర్ ఫైజున్నిసా సొంత పని నిమిత్తం సోమవారం సెలవు పెట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మరో డాక్టర్ శేఖర్‌ను ఇటీవలే ఉన్నతాధికారులు కమ్మరచేడు పీహెచ్‌సీకి డిప్యూటేషన్ కింద పంపించారు. మరో జనరల్ సర్జన్ ఆదివారం అనారోగ్యంతో బాధపడుతూ సెలవు పెట్టి ఆస్పత్రికి రాలేదు. అందుబాటులో ఉన్న డాక్టర్ వాహిద్ సోమవారం ఆస్పత్రికి వచ్చిన 210 మంది రోగులకు పరీక్షలు చేశారు. వైద్యులు సెలవులో ఉండడంతో ఉన్న ఒక డాక్టర్ దగ్గర చూపించుకునేందుకు రోగులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఆస్పత్రిలో క్యూలో నిలబడి ఇబ్బంది పడ్డారు.